క్లుప్తంగా

సామూహిక మంగళ గౌరీ వ్రతం


సామూహిక మంగళగౌరీ వ్రతంలో మహిళలు

వేంపల్లి : స్థానిక సంఘం వీధిలో వెలిసిన గౌరిదేవి ఆలయంలో సామూహిక మంగళ గౌరీ వ్రతాన్ని ఆచరించారు. మంగళవారం మహిళా మండలి బలిజ సంఘం, ఆకుతోట సంఘం ఆధ్వర్యంలో గౌరిదేవి ఆలయంలో మంగళ గౌరీదేవి వ్రతం, పూజలను ప్రధాన అర్చకుడు శంకరమంచి సాయిప్రసాద్ చేపట్టారు. గౌరి దేవి అమ్మవారికి సామూహిక పూజలను మహిళలు చేపట్టారు. కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షుడు నంబూరు కులాయప్ప, గౌరవాధ్యక్షులు కొత్తూరు రెడ్డయ్య, డాక్టర్ రంగయ్య, డాక్టర్ రాజారామ్, మహిళా మండలి అధ్యక్షురాలు రత్నాలమ్మ, మహిళాలు పాల్గొన్నారు.

యువత ఉన్నత ఆశయాలను సాధించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న హెచ్ఓడీ ఉదయ్‌కిరణ్

పులివెందుల టౌన్ : నేటి యువత ఉన్నత ఆశయాలను సాధించేందుకు కష్టపడాలని లయోలా డిగ్రీ కళాశాల హెచ్ఓడీ డాక్టర్ ఉదయ్‌కిరణ్ తెలిపారు. మంగళవారం కళాశాలలో అంతర్జాతీయ యువత దినోత్సవం వేడుకలను నిర్వహించి మాట్లాడారు. యువత వారి భవిష్యత్ గురించి ఆలోచించి ఉన్నత ఆశయాలను సాధించే విధంగా ప్రణాళిక రూపుదిద్దుకోవాలన్నారు. నైపుణ్యం, ఎదుగుదల గురించి వివరించారు. అనంతరం స్కౌట్ మాస్టర్ అహమ్మద్ మాట్లాడుతూ యువత తీసుకోవలసిన ఆలోచనలను తెలియజేస్తూ కోర్సులు, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం తలదించుకునేలా పోలీసుల తీరు


ఎర్రగుంట్లలో ఎంపీ చేస్తున్న నిరసన కార్యక్రమంలో పాల్గొన్న షేక్ ఇస్మాయిల్

కమలాపురం : పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికలలో ఓటమి భయంతో కూటమి ప్రభుత్వం, పోలీసులు ప్రజాస్వామ్యం తలదించుకునేలా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ ఇస్మాయిల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంట్లో ఉన్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని అక్రమ అరెస్ట్ చేసి పలు పోలీస్ స్టేషన్లు తిప్పడం పిరికిపంద చర్య అని పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఒంటిమిట్టలో దొంగ ఓట్లు వేసేవారిని అడ్డుకోకుండా ఆపే ప్రయత్నం చేసిన జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, అంజాద్‌బాషాలపై అక్రమ కేసులు పెట్టి సునకానందాన్ని కూటమి ప్రభుత్వం, పోలీసులు పొందుతున్నారన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందన్నారు.

సాగుచేసిన ప్రతిపంటను నమోదు చేసుకోవాలి

ముద్దనూరు : ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన ప్రతి పంటను రైతులు నమోదు చేసుకోవాలని డీఆర్‌సీ ఏడీఏ అశోక్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని రాఘవాపురం గ్రామంలో జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ అన్ని పంటలను నమోదు చేయించుకుని సకాలంలో బీమా ప్రీమియం చెల్లించాలని, రైతులు విత్తనాలు సాగుచేసేటప్పుడు ట్రైకోడెర్మావిరిడితో విత్తనశుద్ధి చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వినియోగించుకోవాలని, పథకాలపై అవగాహన కలిగివుండాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

చింతకొమ్మదిన్నె : స్థానిక అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో కడప రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి అనుపమానందాజీ మహారాజ్‌జీ వ్యక్తి త్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా స్వామి అనుపమానందాజీ మహారాజ్ మాట్లాడుతూ విద్యా అనేది పుస్తకాలకే పరిమితం కాకూడదని, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడాలని తెలిపారు. విద్యార్థులకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా, నైతిక విలువలను అలవర్చుకునేలా సమాజానికి ఉపయుక్తమైన జ్ఞానాన్ని పొందేందుకు ఈ కార్యక్రమం ఒక ప్రేరణాత్మక వేదికగా నిలిచిందన్నారు. విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలతోపాటు మానసిక స్థిరత్వం ధనాత్మక ఆలోచన, సమయపాలన విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు.

జడ్పీటీసీ ఉప ఎన్నికల చిత్రాలు..


పులివెందులలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సంయమనం పాటించమని కోరుతున్న ఎంపీ అవినాష్ రెడ్డి


తుమ్మలపల్లెలో భారీగా ఉన్న టీడీపీ మూకలు


అచ్చివెళ్ల వద్ద నిరసన తెలుపుతున్న మహిళా ఓటర్లు


టీడీపీ వాళ్లను నిలదీస్తున్న మహిళా ఓటరు


తుమ్మలపల్లెలో పోలీసులపై తిరగబడుతున్న మహిళలు

ఓటు వేసేందుకు వెళితే కొట్టి పంపించేశారు



గ్రామంలోని పోలింగ్ కేంద్రం వద్దకు ఉదయం 7 గంటల తర్వాత ఓటు వేసేందుకు వెళ్లాను. ఎవరికి ఓటు వేస్తావని అక్కడున్న కొంత మంది వ్యక్తులు నన్ను అడిగారు. నా ఇష్టం వచ్చిన వారికి ఓటు వేస్తానని చెప్పాను. వెంటనే నా దగ్గర ఉన్న స్లిప్పు లాక్కొని, చొక్కా చిరిగేటట్టు కొట్టి అక్కడి నుంచి పంపించారు. నేను ఓటు హక్కు వినియోగించుకోలేదు.

– ఆనంద్, ఓటరు, ఎర్రిపల్లె, పులివెందుల మండలం

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి


జెండా ఆవిష్కరణ చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కమలాపురం : విద్యారంగ సమస్యలను ప్రభుత్వాలు తక్షణం పరిష్కరించాలని సీపీఐ ఏరియా కార్యదర్శి నాగేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ ఏరియా కార్యదర్శి షేక్‌సాదిక్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద జెండా ఆవిష్కరించి వారు మాట్లాడారు. ఏఐఎస్ఎఫ్ 1936 ఆగస్టు 12వ తేదీన ఆవిర్భవించిందన్నారు. ఏఐఎస్ఎఫ్ దేశంలోని అనేక సామాజిక, విద్యార్థి ఉద్యమాలను కీలకంగా నిర్వహించిందన్నారు. విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రభుత్వ విద్యా సంరక్షణకు ఉద్యమించిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, ప్రతి ఒక్కరికి నిర్బంధ విద్య అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే జీఓ నెంబర్ 77ను రద్దు చేయాలన్నారు. విద్యాశాఖ మంత్రి యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. వైద్యవిద్యను ప్రైవేటీకరణ చేయకుండా జీఓ నంబర్ 107, 018లను రద్దు చేసి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వారు సీఎంను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు


కమలాపురంలో ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాశాల సిబ్బంది


జమ్మలమడుగులో రంగనాథన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కమిటీ సభ్యులు

కమలాపురం : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వినోద్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఆ కళాశాలలో జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాల విశిష్టత, ఆవశ్యకత గురించి కృషి చేసిన ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల పితామహుడైన ఎస్.ఆర్.రంగనాథన్ పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రతి ఏటా ఆగస్టు 12వ తేదీన జాతీయ గ్రంథాలయాల దినోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. ఆయన లైబ్రేరియన్‌గా గ్రంథాలయాలకు ఎనలేని సేవచేశారన్నారు. గ్రంథాలయాధికారిణిలు హేమసుందరి, భారతి మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలన్నారు. పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. పాఠకుని మనసును వికసింపజేసేవే గ్రంథాలయాలు అని వారు స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : గ్రంథాలయ శాస్త్ర పితామహుడు పద్మశ్రీ డాక్టర్ ఎస్.ఆర్.రంగానాథన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ గ్రంథాలయంలో ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పించారు. గ్రంథాలయాధికారి నాదెండ్ల బాబ్జి మాట్లాడుతూ రంగనాథన్ భారతీయ గణిత శాస్త్రజ్ఞుడు, లైబ్రరీ సైన్స్ పితామహుడు అని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ కోశాధికారి ఎస్.అమీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మత్తు, హెచ్ఐవీపై అవగాహన అవసరం



బ్యానర్‌తో అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు

పులివెందుల టౌన్ : మత్తు పదార్థాలు, హెచ్ఐవీపై యువత అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం నిర్వహించిన హెచ్ఐవీ, మాదక ద్రవ్యాల నివారణ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌లు ప్రారంభించి మాట్లాడారు. హెచ్ఐ వీ, ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష వీడాలని, ముఖ్యంగా యువత మాదక ద్రవ్యాలు, మత్తు పానీయల బారిన పడకుండా చూసుకోవాలన్నారు. గంజాయి, బ్రౌన్ షుగర్ లాంటి మత్తు ఇచ్చే వాటిని నిర్మూలించేందుకు యువత ముందుండాలన్నారు. కార్యక్రమంలో రెసిడెన్షియల్ మెడికల్ అధికారి నవీన్, పులివెందుల ఉపవైద్య ఆరోగ్య శాఖ అధికారి ఖాజా మొయిద్దీన్, ఎయిడ్స్ నియంత్రణ విభాగం వైద్యులు డాక్టర్ సౌజన్య, డాక్టర్ శ్రీనివాస్, ఐసీటీసీ ఎస్ టీడీ, పొగాకు నియంత్రణ, టీబీ కౌన్సిలర్‌లు, ల్యాబ్ టెక్నీషియన్ నాగేష్, సీడీఎస్ మేనేజర్ వలి, సిబ్బంది, సీనియర్ అసిస్టెంట్ నరేష్, ఆసుపత్రి సిబ్బంది, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ వైద్యురాలు సాగర కుమారి కోరారు. మంగళవారం ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ సొసైటీ ఆధ్వర్యంలో వేంపల్లెలోని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపు ర్యాలీని ఏర్పాటు చేశారు. ర్యాలీని ప్రభుత్వ వైద్యురాలు ప్రారంభించారు. హెచ్ఐవీ వల్ల అనార్థాలను ప్రజలకు అవగాహన కల్పించారు.

సస్యరక్షణ చర్యలు పాటించాలి


మాట్లాడుతున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం : రైతులు తాము సాగు చేసిన పంట పొలాల్లో సస్యరక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి తెలిపారు. మంగళవారం కమలాపురం, మీరాపురం గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది... కార్యక్రమానికి హాజరయ్యారు. వరి, మినుము పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు జారీ చేశారు. ఆరుతడి పంటగా వరిని సాగు చేయాలన్నారు. ఇలా సాగు చేయడం వలన పెట్టుబడి తగ్గడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. వరి పొలంలో నారు కొనలు తుంచి నాటితే గుడ్డు దశ నుంచి కాండం తొలుచు పురుగు ఉధృతిని తగ్గించవచ్చన్నారు. అలాగే ప్రతి 2 మీటర్లకు 30 సెం.మీ. చొప్పున కాలిబాటలు తీస్తే పంటకు గాలి, వెలుతురు బాగా అందుతుందన్నారు. తద్వారా దోమపోటును నివారించవచ్చన్నారు. విత్తన శుద్ధి తప్పని సరిగా చేయాలన్నారు. రసం పీల్చే పురుగులను నివారించడానికి ఏకరాకు 20 జిగురు అట్టలను అమర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏఓ నాగభూషణ్‌రెడ్డి, వీఏఏ శివరంజని, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో అవసరం


వేములలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ నాగరాజు


ముద్దనూరులో విద్యార్థులకు మాత్రలను అందిస్తున్న వైద్యులు

వేముల : పిల్లల వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో అవసరమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి నాగరాజు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆయన పాఠశాలలోని విద్యార్థులకు ఆల్బండజోల్ మాత్రలను మింగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నులిపురుగులు వ్యాపించకుండా వ్యక్తిగత పరిశుభ్రత, ఆహారపు అలవాట్లు, చేతులు కడుక్కోవడం తదితర విషయాలను విద్యార్థులకు వివరించారు. పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు కూడా శ్రద్ధ వహించాలన్నారు. 1 నుంచి 19 ఏళ్ల వయస్సు గల బాల, బాలికల్లో నులిపురుగుల నివారణ కొరకు స్కూల్స్, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో ఈ మాత్రలను మింగిస్తామన్నారు. వేముల ఆరోగ్య కేంద్రం పరిధిలో 442 మంది పిల్లలు లక్ష్యం కాగా.. 265 మందికి డీవార్మింగ్ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి ఖాజామొయిద్దీన్, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : ప్రతి ఒక్కరూ వండిన ఆహారాన్ని మాత్రే తినాలని డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు తెలిపారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని జయమ్మ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించి నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని పర్యవేక్షించి, సిబ్బందికి సమగ్ర సూచనలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలకు నులిపురుగులు వ్యాపించకుండా ఉండేందుకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆహారపు అలవాట్లు, గోర్లు కత్తిరించుకోవడం, చేతులు కడుక్కోవడం వంటి ముఖ్యమైన జాగ్రత్తలను పిల్లలకు వివరించారు. తల్లిదండ్రులు కూడా పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి, ప్రభుత్వ ఆరోగ్య సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పులివెందుల జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాజామొద్దీన్, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య, ఎపిడెమియాలజిస్ట్ ఖాజామొద్దీన్, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : విద్యార్థులందరికీ నులిపురుగుల మాత్రలను అందజేసి నులిపురుగులను నివారిద్దామని ఇన్‌చార్జి ఎంపీడీవో పరిపూర్ణ అరుంధతి తెలిపారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో నులిపురుగులను నివారించడానికి ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నట్లు, ప్రతి 6 నెలల కొకసారి ఈ నులిపురుగుల నివారణ మాత్రలను తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కరిష్మా, శ్రీకాంత్‌లు మాట్లాడుతూ విద్యార్థుల్లో నులిపురుగుల వల్ల రక్తహీనత, నీరసం, కడుపునొప్పి తదితర లక్షణాలు వుంటాయన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో కొండమ్మ, పీహెచ్‌సీ సిబ్బంది, ప్రధానోపాధ్యాయుడు ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

నోటిఫికేషన్ జారీ

చింతకొమ్మదిన్నె : కొత్తపేట గ్రామంలోని గంగమ్మ దేవత దేవస్థానంకు సంబంధించి నూతన పాలక మండలి సభ్యుల నియామకం కొరకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు గంగమ్మదేవ దేవస్థానం ఈఓ కృష్ణా నాయక్ మంగళవారం తెలిపారు. ఈ నోటిఫికేషన్ జారీ అయిన తేదీ నాటి నుంచి 20 రోజుల లోపల ఆసక్తి గలవారు దరఖాస్తులను కడప జిల్లా దేవాదాయ శాఖ అధికారి వారికి పంపాలన్నారు.

నేటి నుంచి ఆధార్ సేవలు

ముద్దనూరు : స్థానిక గ్రామ సచివాలయం-1లో బుధవారం నుంచి ఆధార్ సేవా కేంద్రాన్ని పునరుద్ధరించినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో పరిపూర్ణ అరుంధతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు


జమ్మలమడుగు : ఆర్టీసీ ఉద్యోగులకు వెంటనే ఐఆర్‌ను ప్రకటించాలని ఎన్ఎంయూ డిపో ప్రెసిడెంట్ బ్రహ్మం, రిజనల్ కార్యదర్శి పి.సుధాకర్‌లు కోరారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. ఉద్యోగస్తులకు పీఆర్‌సీ కమీషన్ ఏర్పాటు చేసి వేతన సవరణ అయిపోయి ఇప్పటికి రెండు సంవత్సరాలు పూర్తి అయిందని వెంటనే ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే చెల్లించాలని, రిటైర్డు అయిన ఉద్యోగులకు, టెర్మినల్ ఎన్కాష్మెంట్ చెల్లింపులు తక్షణమే ఇవ్వాలన్నారు. ఖాళీగా ఉన్న 8 వేల పోస్టులకు రిక్రూట్ మెంట్ ద్వారా భర్తీ చేయాలని సూచించారు. ఆర్టీసీలో పనిచేసి రిటైర్డు అయిన ఉద్యోగులకు సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రయాణాలకు అనుమతులు ఇవ్వాలన్నారు.

దేశాభివృద్ధి యువతతోనే సాధ్యం


మాట్లాడుతున్న స్టెప్ సీఈఓ సాయిగ్రేస్

కమలాపురం : దేశాభివృద్ధి యువతతోనే సాధ్యం అని స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మదర్‌థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ దేశాభివృద్ధి యువతతోనే సాధ్యం అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే అన్ని రంగాల్లో పాల్గొని తమ ప్రతిభ చాటాలన్నారు. ప్రపంచ విద్యార్థులతో పోటీ పడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. యువత తమ సమస్యలను అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకు రావాలన్నారు. నేటి సమాజంలో యువత సామర్థ్యాన్ని జరుపు కోవడానికి ప్రతి ఏటా ఆగస్టు 12న అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు. 1991లో ఆస్ట్రియాలోని వియాన్నాలో ఐక్యరాజ్య సమితి వ్యవస్థ యొక్క మొదటి సెషన్ కోసం సమావేశమైన యువకులు అంతర్జాతీయ యువజన దినోత్సవం ఆలోచనను ప్రతిపాదించారన్నారను. అప్పటి నుంచి ప్రతి ఏటా ఆగస్టు 12న యువజన దినోత్సవం నిర్వహిస్తున్నారని ఆమె వివరించారు. రీసోర్స్ పర్సన్ గుణశేఖర్, ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, ట్రస్ట్ చైర్మన్ జూటూరు విజయ్‌కుమార్ మాట్లాడారు. అలాగే ప్రగతి జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం, కెరీర్ కౌన్సిలింగ్ నిర్వహించారు.

సేంద్రీయ వ్యవసాయంపై దృష్టి సారించండి


వి.కొత్తపల్లె పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏఓ ఓబులేసు

వేముల : గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు సేంద్రీయ వ్యవసాయంపై దృష్టి సారించాలని ఏఓ ఓబులేసు సూచించారు. మండలంలోని గొందిపల్లె, వి.కొత్తపల్లె గ్రామాల్లో మంగళవార పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీ నేచురల్ ఆర్గానిక్ ఫార్మ్ చేయడంవలన రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. సేంద్రీయ వ్యవసాయ విధానం ద్వారా రైతులు తక్కువ పెట్టుబడులతో పంటలు సాగు చేయవచ్చునన్నారు. ప్రస్తుత వ్యవసాయంలో పెట్టుబడులు పెరిగిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దీన్ని అధిగమించాలంటే సేంద్రీయ వ్యవసాయంవైపు మొగ్గు చూపాలన్నారు. కషాయాలు వాటి ప్రభావం, జీవామృతం, ఘణ జీవామృతం, వెల్లుల్లి కషాయం, వేప గింజల కషాయం రైతులకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఎరువులు, పురుగు మందుల వాడకంవల్ల కలిగిన నష్టాలను నివారించడంతో పాటు మంచి ఆరోగ్యం కోసం ప్రజలకు నాణ్యమైన ఆహారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సురేష్, రైతులు పాల్గొన్నారు.